
# మనం తీసేస్తే కళాఖండాలు



పూజా నమస్కారాల్లేక బూజుపట్టున్నానుగాని నవేజ్జం పెడితే నామహిమ చూపిస్తానన్నాట్ట వెనకటికో దేవుడు. ఎవడో జ్ఞాపకం రావటం లేదు, ఐనా కాకపోయినా ఒకడా ఇద్దరా. తెలుగువాడికి నాయకులెందరున్నారో దేవుళ్ళూ అందరున్నారు. అల్లాగ్గా ఎవడో ఒహ తల మాసినవాడు నాలుగెకరాలు నాదిగాదనుకుని యిల్లా పారేసినట్టాయినా, మళ్ళీ దాన్ని పదహారెకరాల పొలంగా ఫిరాయించుకునే వసతి చూపిస్తాను లేకపోతే ఈ జన్మకిహ ఈ టాలెంటంతా వృథాయే. ఆనక తెలుగు వాళ్ళు యావన్మందిన్నీ సభజేసుకుని అయ్యో ఇంతటివాడు మన మధ్యనే తిరుగుతూ ఉండగా కానుకోలేకపోతిమే అని సమిష్టిగా ఖేదించాలి. అయ్యో గిరీశ వంతవాడుండగా ఒక గేల్ను మెడలిచ్చి మన్ని మనం

గౌరవించుకోలేక పోతిమే అని ఆసేతుహిమాచలమున్నూ కుమిలి కుమిలి దు:ఖించాలి. హన్నన్నా! వాడిచేత ఒక్క పిక్చరు తీయించుకుంటే బాగుండేదే, ఎంత పొరబాటైపోయింది. ఈపాటికిఅగ్గురారం భూవు(లన్నీ కొనిపారేదుంగదా అని ఈ వూరనున్న అడ్డమై(నవాడున్నూ నాలిక్కరుచుకు విలవిల తన్నుకోవాలి.

యేంజేతును వదినా, నాకుమటుకు యిష్టం(వా( ఈలా యావన్మందినీ దు:ఖసముద్రంలో ముంచడం? ఛస్తే మనసొప్పదు--సర్వేజనాస్సుఖినో భవన్తు అన్నాడు శాస్త్రకారుడు. కాని ఎలా? ఏం దారి? అందరూ అజ్ఞానాంధకారంలో మునిగి నా ప్రజ్ఞ పోల్చుకోలేకుండా ఉన్నారాయిరి. వాళ్ళ కన్ను తెరిపించడానికయినా ఒక్క పిక్చరు నా అంతట నేను నష్టానికైనా త్యాగం చేసి తీసి చూపించడం ధర్మం. మీరే చెప్పండి ధర్మవా( కాదా!

అవునా? .... అయినప్పుడు ధర్మపాలనకు ఈవెధవ డబ్బు అనేది అడ్డుపడుతోంది. మరేవీ(లేదు. నేను పిక్చరు మొదలెట్టి రెండు రీళ్ళు అంటే--మీరు స్నానం జేసిన బట్టలతోనే అలా మడిగా వనలక్ష్మిలా అలా....అలా పెరట్లో పాదులికి నీళ్ళోసి గుమ్మడేడీ పాటపాడి అంతలో పెరటి దోవన జొరబడుతున్న హీరో గిరీశాన్ని అలా అలా ఓరకంటజూసి దోరనవ్వు నవ్వి చెంగున లేడిలా గెంతేసి వంటింటోకి వెళ్ళి పోయేటంత మేరా బయస్కోపు తీసినట్టాయనా--అంతే ఇహ మరి మీ డబ్బులోది కాండబ్బు కదపనక్కర్లేదు. డిస్ట్రిబ్యూటర్లే -- అంటే పెట్టుబడిదార్లు వచ్చి పడిపోయి, గిరీశం గారూ... ఇహ మీరు కాణీ పెట్టడానికి నల్ల కాదు, పెడితే మా మీద ఒట్టేను--ఇందండి చిల్లర ఖర్చులికి ఈ లక్ష ఉంచండి. మీరూ మిస్ బుచ్చమ్మగారూ స్టూడియోకి రావడానికి భేషైన బగ్గీ తెప్పించాం, చిత్తగించండి అ(వటాని కాళ్ళా వేళ్ళా బడతారు.

....ఎవరది ప్రొడ్యూసర్ చౌదరి గారా! వీడీ దారిన పోతున్నాడేవి(టి చెప్మా, నన్నొహకంట కనిపెడుతున్నాడా లేక ఈ వెంపు న్యూ టాలంట్ల కోసం హంట్ చేస్తున్నాడా. వీడికో రస్సా వేసి చూద్దాం. మొన్నటి లెక్చరు వీడిమీద పనిచేసి ఉన్నట్టాయనా ఈ దెబ్బకి దారి కొస్తాడు. లేదా నా లెక్చర్లు దున్నపోతుమీద వానే అనుకుంటే సరి. అయినా

దున్నలున్నాయని వాన కురవడం మానుతుందా యేవిఁటి? ఇదిగో వదినగారూ, నాకు రాచకార్యాలున్నాయి గాని మీ రిహ ఔట్ ఫీల్డులోకి--అనగా తెరలోనికి నిష్క్రమించి వేగిరం ఓగిరంబును సమకూర్పుడు....వాట్ మైగాడ్ డైలాగులు మహాపసందుగా పడుతున్నాయే అయాచితంగా. శుభశకునం గాబోలు! విష్‌యు గుడ్‌లక్ గిరీశం? నో, సినిమాలో రూజ్వెల్టన్నట్లు--చ్చార్జ్!

అయ్యా! చౌదరిగారూ, గుడ్‌మార్నింగ్, ఏవిటలా చురుగ్గా అడుగేస్తున్నారు....మీ పిక్చరు కప్పుడే అవుట్డోర్ మాటింగారంభించారా యేవిఁటీ....కాదా, మరేమిటీ హడావుడీ! ఏమో, మిమ్మల్ని చూస్తే అలా అనబుద్ధేసింది స్మండీ. చూశారో లేదో ఒక్కడుగింటి కెళ్ళి అద్దం చూసుకోండి! మీ కప్పుడే యేస్ ప్రొడ్యూసరు కళ ఉట్టిపడుతోంది. కక్కొచ్చినా కళ్యాణం వచ్చినా మరాగదన్నారు. సినిమా కూడా అంతే! ఆ రోజు రాకనేపోవాలి, తీరా వచ్చి పడిపోయినా మరిహ దానినడ్డడానికి బ్రహ్మక్కూడా శక్యం కాదు. అర్జెంటు పనా, పదండి నేనూ నాలుగడుగులు వేస్తాను. బిఫోర్ సప్పర్ వాకెమైల్ అన్నాడు ఇంగ్లీషు వాడు.....చూశారూ ఏడడుగులు కలిసివస్తే వారు వీరవుతారన్నాడు. అంటే నేను చౌదరి, మీరు గిరీశంగా ఫిరాయింపై పోతామని గాదు, మన మిద్దరం ఏకమైపోయి ఏదో మహాఘనకార్యం--అనగా లక్షలు గుమ్మరించేసే బాక్సాఫీసు హిట్ పిక్చరు తీస్తామని తాత్పర్యం. బ్రహ్మదేవుడిలా రాశిపడేశాడు మనదేవుంది. మనం నిమిత్తమాత్రులం. కాపోతే నేను బొంబాయివాళ్ళకి పిక్చరు తీసిపెడతానని మాటివ్వడవేఁవిటి. తీరా అంతా సిద్ధమయ్యాక ఛస్ ముందు మాతృభాషలో తియ్యందే నేను మరో భాషకి రానని నేను దాన్ని కాలదన్ని చక్కా వెళ్ళిపోయి రావడవేఁవిటి--అందాకా చోద్దెం నా కోసం మీరూ, మీకోసం నేనూ వెతుక్కుంటూ ఇందమ్మట 13వ రీలులో హీరో హీరోయినుల్లా తిరగడవేఁవిటి, అంతా ఘటన కాకపోతే.

మీ కలా రాసి పడేసుంది నాయనా చౌదరీ కోటేశ్వరుడివి కమ్మని. వద్దంటే తప్పుతుందా.....ఏదో సందేహం బాధిస్తోంది మిమ్మల్ని. జనాభాకి నచ్చే పిక్చరు వీడు తియ్యగలడా మనసా అని తర్కిస్తున్నారు కాబోలు. యంతమాటనుకున్నారు. అసలు ప్రజలనగా యవరండీ. ఉట్టి గొర్రెల మంద. ఆ మందకి ముందు గొర్రెలం మనవేఁ,

మనంవెలా నడిస్తే అవలా వెళ్ళిపోయొస్తాయి. కాకపోతే అవెలా నడిస్తే మనవలా నడిచి వాటివెంట పోతాం. ఇదీ ఇందులో ధర్మ సూక్ష్మం. ఇహపోతే ప్రజలకి ఏది నచ్చుతుంది అన్నది పసిగట్టడం ఏ మాత్రవుంన్నూ బ్రహ్మవిద్దె గాదు గదా. రీసెంట్ హిట్‌లు నాలుగు చూసుకుని అవే తిరగేసి మరగేసి వాళ్ళ యదాన కొడితే సరీ--అంథా గుర్రప్పందాల టెక్నిక్కేనంటే నమ్మండి.

మరొహటి--ఈ ప్రజలున్నారే వాళ్ళంతా సుబ్బరమైన తిండికీ, గుడ్డకి, కంపకీ మొహం వాచి ఉంటారన్నమాట. అంచేత అంట్లుదోవేం అప్పులమ్మకి కూడా అట్లా అంట్లు దోముతున్నప్పుడు జార్జెటు చీర చుట్టబెట్టండి. జోనఫైనుచేత బర్మీస్ సిగ చుట్టించండి. హీరో రిక్షావాలా అయినా పోలీసు అయినా గుమాస్తా అయినా సరే సుబ్బరమైన గాబర్డీను సూట్లు కుట్టించి మొహానికింత పవుడరు మెత్తండి. జనం మంచి ఇళ్ళకి మొహంవాచి ఉంటారు గాన మన బాబు సొమ్మేంగదా పోయేది--పెద్ద భవంతులు కట్టించేయండి. అందులో అద్దెకుండేది- ఎవడైనా సరే, ఇదిగో ఇలాటివేళ కొందరు దుష్టులొచ్చి ఎన్.జీ.వో. గాడికి ఇంత భవంతెలా వస్తుందంటారు. వాళ్ళ మొహం వాళ్ళకేం తేలీదు. జనం డాన్సులికి మొహం వాచి ఉంటారు. ఓ అరడజను డాన్సుల్లాంటివి గుప్పించెయ్యండి. జనం పాటలంటే చెవి కోసుకుంటారు. పద్యాలు కూడా తోసేసి రెండు చెవులూ కోసుగోమనండి. ఇన్ని ఉన్నాక ఇంక కథా కాకరకాయ కూడా పెడితే మొహం మొత్తిపోతుంది. ఈ విధంగా తీసి పారేద్దాం. అయితే ఏడుపుకీ కష్టాలకీ కూడా మొహంవాచి ఉండకపోయినా అవిమాత్రం బాగా ధట్టించాలనుకోండి.

ఆ తరువాతంటారా మందే రాజ్యం. నాలుగుడబ్బులు నొల్లుకున్నాక మనమాటకి అడ్డెక్కడ మనపేరుకి ఒడ్డెక్కడ. మనం తీసినవే కళాఖండాలు. మనం తీసినవే హిట్ పిక్చర్లు. మనవేం మహా ప్రొడ్యూసర్లం. మహాడైరెక్టర్లం. మహానటులం--కాదన్న కళ్ళన్న యవడండీ. దేవతావస్త్రాలని ప్రశస్తి చేసినట్టే ప్రతిఅడ్డమైనవాడూ మనలోనూ మన చేష్టల్లోనూ స్వారస్యాలు తీసి ఒల్లిస్తాడు. ఇహ నాతరువాత అన్నీ హిట్ పిక్చర్లే. అంతా డబ్బే. మిమ్మల్ని దారిలో పెట్టేశాక మీరే డైరెక్షనూ, డైలాగులూ, మ్యూజిక్కూ, యాక్టింగూ

అవలీలగా లాగవతల పారేస్తారు, నేనానక పొలిటిక్సులోకి వెళ్ళి పోతాననుకోండి. నా లాంటి వాడు ఒక్క ఫీల్డునే నమ్ముకొని అంకితమైపోతే మిగతావాళ్ళు ఊరుకోరు. అంచాత నాలుగూ చక్కబెట్టుకోవాలి. ఆలస్యం చేయక నన్ను బుక్ చేసుకుని అడ్వాన్సిచ్చి ఆకట్టేసుకోండి.ఒక ఘడియ ఆలస్యమైతే రేటు లక్షల్లోకి వెళ్లిపోతుంది....అంతే మరీ. ఏవిటనుకున్నారు. ఫీటు బట్టే రేటు. ఫిలింఫీల్డులో ఇవాళ ఆరుకాన్లు తీసుకుంటాం. రేపు పిక్చరు హిట్టయితే అరవై వేలు గిట్టవంటాం--హఠాత్తుగా ప్రజ పెరిగింది గాబట్టి. అంచేత జాగర్త పడండి. అప్పుడే నేను ఫీల్డులోకి దిగుతున్నానని విని చాలమంది ప్రొడ్యూసర్లు ఎగబడి నాకోసం వేటాడుతున్నారట. ఏ నిమిషానికెవడొచ్చినా గెద్దలా తన్నుకుపోతాడు. వెనక విచారించి లాభంలే....

అరే, వీడా! వీడెక్కడ నించొచ్చి పడ్డాడోయ్ భగవాన్లూ.... డామిట్ సందు మళ్ళటానిక్కూడా సావకాశం చాలదే. అయ, నమస్కారం, అనెక్స్‌పెక్టెడ్ లక్! ఏవి అదృష్టం? సుబ్బయ్యగారూ, మిమ్మల్నిక్కడిలా కలుసుకుంటానని కల్లోకూడా అనుకోలేదు. మీ ప్రశస్తే చెబుతున్నాను చౌదరిగారికి......

* * * *

అలా పోయేటప్పుడు కాబోయిన హీరోయినొకర్తె కాదు కూడదని పట్టుబడితే ఆవిడ ప్రొప్రయిటరు తాలూకు హీరోయిననని పసిగట్టలేక--రమ్మన్నాడు. బొంబాయిలో ఆలిండియా లెవెల్‌మీద పిక్చరు తీసి ఇంట్రడ్యూస్ చేద్దామని. తీరా ఆవిడ ఇంటర్నేషనల్ లెవెల్లో పిక్చరు తీయించి వేషం కడదామని అట్నించటే వెళ్ళిపోయిందనుకోండి, ఆ తరువాత గిరీశం చాలా క్షోభపడ్డాడు-ఎంతో పశ్చాత్తాపపడ్డాడు. ఆ వేడికి నిజంగానే ఊష్ణవొచ్చి వాడిలో దుష్టతనాన్ని కొట్టేసింది.

చిత్తం. ఒప్పుకుంటాను రైటే.... అక్షరాలా రైటే.... నేనే భోజకాళిదాసునైతే మీ తిట్టుకవితకు అక్షరలక్ష లిచ్చి పై పెచ్చు క్షమాపణ చెప్పుకొందును. ఇంకా రొఖ్ఖం జత పళ్ళేదు తప్ప.... యాస్. యువార్ రైట్. కొంత కాలం క్రితం గిరీశం అనే ఫూలిష్ యంగ్‌మాన్ వొకడు ఉండేవాడు. చాలా తెలివైనవాడు. ఒక్క మాటలో చెప్పాలంటే

జీనియస్. అయితేనేమి, వాడి దురదృష్టం వల్ల కూడని మాటలు విని తప్పుదారిన పడి మీ వంటి మహానుభావుల ఫిలింప్రొడక్షన్‌ను మధ్యలో వదిలేసి ఆవేళకి తన చొక్కాజేబులో కొంత కంపెనీ పైకం ఉన్న సంగతి కనుక్కోలేక దారి తప్పిపోయిన మాట వాస్తవమే. పరిశుద్ధ హృదయంతో తిరిగి కళారాధనకు జీవితాన్నంకితం చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. ఇప్పుడు కొత్త ప్రొడ్యూసరు, బ్యూటిఫుల్ విలేజి బ్యూటీ హీరోయిను, చక్కని కథ సమకూర్చుకొన్నాడు. ఆ గిరీశవే ఈ గిరీశం. స్వర్గానికి ఒక చీడీ తరవాయిగా ఉన్న నన్ను తిరిగి పాతాళానికి లాగడానికి ఈ సుబ్బన్న గారు నా పురాకృతం వల్ల ఇక్కడ ఆవిర్భవించారు. నావంటి రిఫార్మ్‌డ్ జీనియస్సులను ఎంకరేజ్ చేసి పైకి తేవడం తమకు బిరుదుగాని నన్నూ **అల్లవాడిగా చూసి** డ్రాప్ చేయడం న్యాయం కాదు. ఐ క్రేవ్ యువర్ మెర్సీ చౌదరిగారూ, ఐ క్రేవ్ యువర్ మెర్సీ .... చిత్తం దాన్దేముంది, పశ్చాత్తాపం అన్నాక పశ్చాత్తాపవేఁ. ట్రూ రిపెంటెన్సుకి ట్వెంటీ ఫోరవర్స్ చాలదాండీ ... వాట్.... అంతే? లాభం లేదా? .....

డామిట్ కథ అడ్డంగా తిరిగింది.




గిరీశం ఏక్సర్సు